సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

నేడు వాకథాన్

మురళీనగర్: ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా శనివారం వాకథాన్ నిర్వహించనున్నట్లు వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ పరిసరాల్లోని వాకర్స్ క్లబ్ సభ్యులు, ఇతర వాకర్స్‌తో కలిసి ప్లాస్టిక్ నివారణపై ప్రజలకు అవగాహన కోసం ఉదయం 5 గంటలకు బిర్లా కూడలి నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వాకర్స్ అందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో సీసీ కెమెరాల నిఘా



పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

సీతమ్మధార: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 15 రోజుల కిందట గంజాయి ముద్దాయి బేడీలతో పోలీస్ స్టేషన్ నుంచి పరారైన సంగతి తెలిసిందే. నైట్ డ్యూటీలో ఒక హెచ్‌సీతోపాటు ఒక కానిస్టేబుల్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా కేసు వస్తే అర్ధరాత్రి ఒకరు వెళ్లి పోతే ఒక్క మహిళా ఉండాల్సి ఉంటుంది. అదే సమయంలో స్టేషన్‌లో ముద్దాయిలు ఉంటారు. దీంతో సీఐ, ఎస్‌ఐ, హెచ్‌సీలు, స్టేషన్ ఆవరణలో సుమారు పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీంతో స్టేషన్‌లో జరిగే వాటిపై సీసీ ఫుటేజీల ద్వారా పర్యవేక్షణ ఉంటుంది.

నడక పోటీలు రేపు

మురళీనగర్: స్థానిక వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వాకర్ లంకా ఆదినారాయణ స్మారక నడక పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు 31–40, 41–50, 51–60, 61–70, 71–80, 81–90 వయసుల వారీగా పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనాల్సిన వారు 83091 57522 నంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు మే 1న నిర్వహించే ప్రత్యేక సమావేశంలో బహుమతులు అందిస్తామని చెప్పారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి మాట్లాడుతూ అరబిందో ఫార్మా, దక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మా, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, జయభేరి ఆటో మొబైల్స్, సుగుణ ఫూడ్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీ, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 723 ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించగా.. 234 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి ఉమాదేవి అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. సుమారు 142 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(టెక్నికల్) కె.సుధా, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై ప్రజాభిప్రాయాలు సేకరించాలి

సీతంపేట: ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిన తర్వాతే పోర్టు స్టేడియాన్ని ప్రైవేటీకరించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న పోర్టు స్టేడియాన్ని ప్రైవేటు వ్యక్తులకు లబ్ధి చేకూర్చడానికి లాంగ్ లీజు పేరిట చేస్తున్న ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని పోర్టు యాజమాన్యం విరమించాలని కోరారు. పోర్టు స్కూల్‌ను యథావిధిగా ఒకటి నుంచి పదో తరగతి వరకు నడపాలన్నారు.

చుట్టూ తిరిగి వెళ్ల లేక..



రామాటాకీస్ రోడ్డులో స్టాపర్ బోర్డులతో మూసివేసిన శ్రీనగర్ రోడ్



ప్రభుత్వ కంటి ఆస్పత్రి వద్ద రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న ఆటో, ద్విచక్ర వాహన చోదకులు

- రామటాకీస్ రోడ్డులో రాంగ్ రూట్‌లో ప్రయాణాలు
- శ్రీనగర్ కూడలిలో స్టాపర్ బోర్డుల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు
- ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులో రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తూ వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. బుల్లయ్య కళాశాల రోడ్డు నుంచి ద్వారకానగర్ వైపు వెళ్లే మార్గంలోని శ్రీనగర్ కూడలిలో(ఎస్‌వీఆర్ ట్రావెల్స్ ఎదురుగా) స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారు. చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో వాహన చోదకులు రాంగ్ రూట్‌ను ఆశ్రయిస్తున్నారు. సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం సెంటర్, రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట ప్రాంతాల వారు ద్వారకానగర్ వెళ్లడానికి రామాటాకీస్ కూడలికి ముందున్న శ్రీనగర్ రోడ్డులో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ మార్గంలో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రతి రోజూ సాయంత్రం నుంచి రాత్రి 11 గంటల వరకు బారులు తీరుతుంటాయి. ఆస్పత్రి వద్ద పికప్ పాయింట్ ఏర్పాటు చేయడంతో బస్సులు ఒకదాని వెనుక మరొకటి క్యూ కడుతుంటాయి. ఇదే సమయంలో ఆర్టీసీ కాంప్లెక్స్, మద్దిలపాలెం నుంచి సీతమ్మధారకు వెళ్లే వాహనాలతో ఈ మార్గం అంతా రద్దీగా ఉంటుంది. ట్రావెల్స్ బస్సుల కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

మార్గం మూసివేత..

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు రామాటాకీస్ రోడ్డు నుంచి శ్రీనగర్‌కు వెళ్లే మార్గంలో డివైడర్ వద్ద స్టాపర్ బోర్డులతో మార్గం మూసివేశారు. అప్పటి నుంచి వాహన చోదకులకు కష్టాలు మొదలయ్యాయి. సీతమ్మధార వైపు సత్యం సెంటర్ నుంచి వచ్చే వాహనాలు రామాటాకీస్ కూడలి వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని శ్రీనగర్ మీదుగా ద్వారకానగర్ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చుట్టూ తిరిగి వెళ్ల లేక వాహన చోదకులు దగ్గర మార్గమని అంబేడ్కర్ భవన్ ఎదురుగా ఉన్న డివైడర్ గ్యాప్ నుంచి కంటి ఆస్పత్రి ముందుగా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. దీంతో రామాటాకీస్, శ్రీనగర్ నుంచి సత్యం సెంటర్‌కు వెళ్లే వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు ట్రావెల్స్ బస్సులు బారులు తీరి ఉన్నా.. వాటి పక్క నుంచి ప్రమాదకరంగా రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. సరైన మార్గంలో వస్తున్న వారు వీరిని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు.

ట్రావెల్ బస్సులకు మేలు చేసేలా..!

ఈ మార్గంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తిరుపతి వంటి సుదూర ప్రాంతాలకు ప్రతి రోజూ 50 నుంచి 60 వరకు ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ప్రయాణికులను ఎక్కించుకోవడానికి బారులు తీరుతూ ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నాయి. నగరం మధ్యలో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ట్రావెల్ బస్సుల పికప్ పాయింట్‌ను తొలగించాల్సిన పోలీస్ యంత్రాంగం వారికి మరింత మేలు చేసేలా శ్రీనగర్ రోడ్ వైపు వెళ్లకుండా స్టాపర్ బోర్డు ఏర్పాటు చేశారని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. వారాంతపు రోజులు, సెలవు దినాలు, పండగ రోజుల్లో ట్రావెల్స్ బస్సుల వల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. పత్రికల్లో వార్తలు వచ్చినపుడు ఒకటి రెండు రోజులు హడావిడి చేసి బస్సులు తరలిస్తున్నారు. ఆపై యథావిధిగా ట్రావెల్స్ బస్సుల దందా కొనసాగుతూనే ఉంది.

పికప్ పాయింట్ తరలించండి

రామాటాకీస్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల పికప్ పాయింట్‌ను తరలించాలి. శ్రీనగర్ రోడ్డు వైపు వెళ్లకుండా స్టాపర్ బోర్డులతో మార్గం మూసివేయడం సరికాదు. దీంతో చాలా మంది రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టాలి.

– ఎం.బాలాజీ, సీతమ్మధార

రహదారులు మూసేస్తే ఎలా?

సిటీ మధ్యలో రద్దీగా ఉండే మార్గంలో ట్రావెల్స్ బస్సులు గంటల తరబడి ఒకదాని వెంట మరొకటి బారులు తీరుతున్నాయి. సమస్యకు కారణమైన వారిని వదిలేసి, రహదారులు మూసేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. చుట్టూ తిరిగి వెళ్లడం వల్ల సమయం, ఇంధనం వృథా అవుతోంది.

– కె.వేణుగోపాల్, రేసపువానిపాలెం

పుడమితల్లిని పరిరక్షిద్దాం



మొక్కలు నాటుతున్న జెడ్సీ కృష్ణ

మద్దిలపాలెం: కాలుష్యం కోరల నుంచి పుడమితల్లిని పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ అన్నారు. 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్, పార్వతీనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చదనంపై అవగాహన ర్యాలీ చేశారు. ఆ ప్రాంతాల్లోని పార్కుల్లో జెడ్సీ మొక్కలు నాటి మాట్లాడారు. తాగే నీరు, పీల్చే గాలి, నివసించే నేల పంచభూతాలు కాలుష్యంలో చిక్కుకున్నాయని, వాటిని రక్షించుకుని పర్యావరణాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే నష్టాలను గురించి స్థానికులకు సచివాలయ కార్యదర్శి, సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ తులసి, సచివాలయ శానిటేషన్ కార్యదర్శి భవాని, శానిటేషన్ సూపర్‌వైజర్లు అమీనా, రామారావు, జాకీర్ హుస్సేన్‌నగర్ అధ్యక్షుడు మున్నా, కార్యదర్శి వలి, బాషా తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో రుచికర వంటకాలు

మురళీనగర్: ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మురళీనగర్‌లోని గంగాగోదావరి అపార్ట్‌మెంట్‌లో చిరుధాన్యాలతో వంటకాల ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్రీమతి చికెన్ వ్యవస్థాపకులు ఎస్‌వీ రావు, బాలకృష్ణలు తృణధాన్యాలతో వంటకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా రాగులు, కొర్రలు, సామలు, గంటిలు, జొన్నలతో రుచికరంగా వంటకాల తయారీ విధానాన్ని వారు వివరించారు. శ్రీమతి కిచెన్ తయారుచేసిన ప్రోటీన్‌జావ, పాయసం వంటకాలను అపార్ట్‌మెంట్ వాసులకు పంపిణీ చేశారు. ప్లాస్టిక్‌ను నిషేధించి పుడమిని రక్షించుకుందామంటూ మహిళలు ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, జి.లక్ష్మి, పి.యశోద, ఎ.రాధ పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిషేధంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళా వాకర్స్

వస్త్ర పరిశ్రమ స్థాపనకు ఉచిత శిక్షణ

సీతమ్మధార: అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో) ఆధ్వర్యంలో వస్త్ర పరిశ్రమ స్థాపనకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ప్రాజెక్టు అధికారి ఎ.అజయ్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వస్త్ర పరిశ్రమ స్థాపించాలనే ఆసక్తి గల మహిళలు, పురుషులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వ్యవస్థాపకత అభివృద్ధి కార్యక్రమం(ఈడీపీ)లో పరిశ్రమ స్థాపన, అకౌంటింగ్ తదితర అంశాలపై వారం రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు సీతమ్మధారలోని అలెప్ కార్యాలయంలో, 63014 41183 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఉర్రూతలూగించిన సినీ గీతాలాపన



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో న్యాయవాదుల బృందంచే సుస్వర గాన మాధురి పేరిట శుక్రవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సంస్థ అధ్యక్షురాలు మీనాక్షి, ప్రధాన కార్యదర్శి వంకా సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించి ఆహుతులను ఉర్రూతలూగించారు. గాయనీ గాయకులు మాధవ్, రేణుకాదేవి, ఎస్.ఎస్.ఎన్.రాజు పలు గీతాలు ఆలపించారు.

పదేళ్లు దాటితే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

మహారాణిపేట: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటితే కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాస మూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ రెండో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డు ద్వారా బ్యాంక్ ఖాతా, సిమ్ కార్డ్, వివిధ ఉపకార వేతనాలు, ఆదాయపు పన్ను, బ్యాంకు రుణాలు, ఒక దేశం ఒక రేషన్ కార్డు కింద దేశంలో ఎక్కడైనా సరుకులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను నవీకరించిన ఆధార్‌తో పొందవచ్చని ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.

దీనికోసం ఏదైనా అడ్రస్ ప్రూఫ్ , ఐడెంటిటీ ప్రూఫ్‌తో దగ్గరలోని ఆధార్ కేంద్రం, మండల ప్రధాన కేంద్రంలోని సచివాలయం, బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్, వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో గాని అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. జూన్ నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితమని పేర్కొన్నారు. అడ్రెస్ ప్రూఫ్ లేనట్లయితే వారి సచివాలయం లో 20/- చెల్లించి సర్టిఫికెట్ పొందవచ్చని తెలిపారు . జిల్లాలో ఇంకా ఆధార్ అప్ డేట్ చేసుకోని వారు సుమారు 4 లక్షల మంది ఉన్నారన్నారు. ఆధార్ అప్ డేట్‌కు సంబంధించిన సమాచారం, వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1947ను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్డీవో పూర్ణమా దేవి , జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ , యూఐడీఏఐ రీజినల్ మేనేజర్ గిరిధర్ , వైద్య ఆరోగ్య శాఖ , బ్యాంకింగ్, పోస్టల్,ఎడ్యుకేషన్, బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపే సివిల్ సర్వీసెస్ డే

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగులను గుర్తించి, వారిలో స్ఫూర్తి నింపేందుకే జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ప్రతి ఏడాది ఏప్రిల్ 21వ తేదీన జరుపుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజును ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ పబ్లిక్ సర్వీస్ విభాగాల్లో నిమగ్నమై ఉన్న అధికారుల పనిని గుర్తించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 21న దీనిని పాటిస్తారన్నారు. అనంతరం 16వ జాతీయ సివిల్ సర్వీసెస్ రోజు సందర్భంగా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగుల చేత జాయింట్ కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ విశ్వనాథన్

7 కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: విశాఖలో శుక్రవారం ఏడు కరోనా కేసులు నమోదయ్యాయి. 24 గంటల్లో 244 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఏడుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో మొత్తం కరోనా సోకిన వారి సంఖ్య 30కి చేరింది. 13 మంది డిశ్చార్జ్ అయ్యారు. 30 మంది చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

వారణాసి రైలుకు మరిన్ని కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల అనూహ్య స్పందన నేపథ్యంలో విశాఖ–బనారస్–విశాఖ మధ్య నడుస్తున్న వీక్లీ స్పెషల్ రైలుకు ఈ నెల 26 నుంచి 1–సెకండ్ ఏసీ , 1–థర్డ్ ఏసీ కోచ్‌లను అదనంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఆయా తేదీల నుంచి ఈ రైలు 2–సెకండ్ ఏసీ , 4–థర్డ్ ఏసీ , 12–స్లీపర్ క్లాస్, 2–జనరల్ సెకండ్ క్లాస్, 2–సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగుల కోచ్‌లతో నడుస్తాయి.

గౌహతి–సికింద్రాబాద్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

గౌహతి–సికింద్రాబాద్–గౌహతి మధ్య నడుస్తున్న రైలుకు ఈ నెల 27 నుంచి నుంచి ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం తెలిపారు.

- గౌహతిలో బయల్దేరే గౌహతి–సికింద్రాబాద్(12514) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి, తిరిగి సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబాద్–గౌహతి (12513)ఎక్స్‌ప్రెస్‌కు 29 నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు జతచేస్తున్నారు.

రైళ్ల దారి మళ్లింపు, రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్, గన్నవరం–ముస్తాబాద–గుణదల సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునీకీకరణ పనుల నిమిత్తం ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు రీషెడ్యూల్ చేస్తున్నట్లు చెప్పారు. కింద పేర్కొన్న రైళ్లు ఆయా తేదీల్లో రెగ్యులర్ మార్గం నిడదవోలు–ఏలూరు–విజయవాడల మీదుగా కాకుండా వయా నిడదవోలు–భీమవరం టౌన్– గుడివాడ–విజయవాడల మీదుగా నడుస్తాయి.

- ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖలో బయలుదేరే విశాఖపట్నం–గుంటూరు(17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్.. ఈ నెల 21న ధన్‌బాద్‌లో బయలుదేరిన ధన్‌బాద్–అలెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్.. ఈ నెల 21న టాటానగర్‌లో బయలుదేరే టాటానగర్–బెంగళూరు(12889) ఎక్స్‌ప్రెస్.. ఈ నెల 22న హతియాలో బయలుదేరే హతియా–బెంగళూరు(18637) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో నడుస్తాయి.

రీషెడ్యూల్, గమ్యం కుదించిన రైళ్ల వివరాలు..

- ఈ నెల 22న హజ్రత్ నిజాముద్దీన్‌లో హజ్రత్ నిజాముద్దీన్ – విశాఖపట్నం (12808) సమతా ఎక్స్‌ప్రెస్ 5 గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 22న నాందేడ్‌లో నాందేడ్ – సంబల్‌పూర్ (20810) ఎక్స్‌ప్రెస్ నాలుగున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరుతుంది.
- ఈ నెల 22న గుంటూరులో బయలుదేరే గుంటూరు–రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 23న రాయగడ–గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ రాయగడ నుంచి కాకుండా విజయనగరం నుంచి బయలుదేరుతుంది.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం' లో కె.కె.రాజు



మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ హనోకు

తాటిచెట్లపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి పరిపాలనలో పార్టీలకు, వర్గాలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి 254 సచివాలయం పరిధి లక్ష్మీ నారాయణపురం–2లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరుగుతున్న మేలును వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం వెంటనే కృషి చేయాలని సంబంధిత సిబ్బందికి కె.కె.రాజు సూచిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సేనాపతి అప్పారావు, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాస్, నూకరాజు, నాయకులు జి.హరిపట్నాయక్, సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, నర్సారావు, ఆదిలక్ష్మి, సన్నీ, నానిబాబు, సువర్ణ, 254 సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

జోన్–5 కార్యాలయ అభివృద్ధికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



మాట్లాడుతున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 కార్యాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలోని వివిధ విభాగాల్లో సమస్యలు నెలకొన్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలతో పాటు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి సమస్యలపై ఈ నెల 17న 'జోన్–5 కార్యాలయంలో సమస్యల తిష్ట' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జెడ్సీ కృష్ణ స్పందించారు. ఇంజినీరింగ్ ఈఈలు శ్రీనివాసరావు, ప్రసన్నరెడ్డికి మరమ్మతులకు అంచనా విలువ వేయమని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం 'సాక్షి'తో జెడ్సీ మాట్లాడారు. జీవీఎంసీ నిధులు రూ.19.7 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పనుల నిమిత్తం కాంట్రాక్టర్లకు టెండర్ నోటిఫికేషన్ ప్రకటించామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించి జోనల్ కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని జెడ్సీ కృష్ణ చెప్పారు.

జెడ్సీ దృష్టికి స్థల సమస్య



ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న సమస్యలు తెలుసుకుంటున్న జోన్–5 కమిషనర్ కృష్ణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో శుక్రవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ పర్యటించారు. మాధవధార వుడా కాలనీ సర్వే నంబర్–6లో సుమారు 48 సెంట్ల ప్రభుత్వ స్థలంలో అర్బన్ పబ్లిక్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ఆ స్థలాన్ని అక్కడి మాధవధార వుడా కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు జీవీఎంసీ అనుమతి లేకుండా బోర్డు పెట్టి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. కళింగ నగర్‌లో రోడ్డు సమస్య, ఆర్టీవో కార్యాలయం వద్ద ఉన్న బడ్డీలు తొలగించడంతో వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని, సర్వే నంబర్–6లోని స్థలం ఎవరికి చెందినదో పరిశీలించాలని జెడ్సీ కృష్ణకు కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని సింధూర

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ ఆహుతులను అలరించింది. ద్వారం త్యాగరాజు శిష్యురాలు వాజపేయయాజుల సింధూర తన మృదు మధురమైన గానంతో పేరొందిన త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. గణేష పంచరత్నం , శ్రీసరస్వతి నమోస్తుతే, శోభిల్లు సప్తేశ్వర, తిరో తిరో జవరాల, సీతమ్మ మాయమ్మ, కంటి శుక్రవారము, లక్ష్మీ రావే మా ఇంటికి, చూడరమ్మ శతులాల కీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తాయి. ఈమెకు ఏవీకే ఆదిత్య వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని సింధూరను అభినందించి సత్కరించారు.

చందనోత్సవంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం



ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు

సీతంపేట: ఈ నెల 23న జరిగే వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవంలో సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా యంత్రాంగం దర్శనం ఏర్పాట్లు చేసిందని సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేటలోని ఆయన ఇంటి వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది రెండు లక్షలకు పైగా భక్తులు అప్పన్న దర్శనానికి వస్తారని అంచనా వేసినట్టు చెప్పారు. దానికి తగినట్టుగా ఆలయ ఈవో వై.శ్రీనాథరావు నేతృత్వంలో తాగునీటి సదుపాయం, క్యూలైన్లు, చలువ పందిర్లు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. భక్తుల దర్శనానికి ఆటంకం కలగకుండా నిర్ణీత వేళల్లో ప్రోటోకాల్, వీవీఐపీ దర్శనాలకు అనుమతి ఇస్తున్నట్టు తెలిపారు. చందనోత్సవం విజయవంతంగా పూర్తయ్యేందుకు ట్రస్టు సభ్యులకు ఈవో కొన్ని సూచనలు చేశారన్నారు. సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు, కొండపై వాహనాల రద్దీ తగ్గించేలా ప్రోటోకాల్ పాసులు చాలా వరకు తగ్గించారని, ఈ విషయంలో వీవీఐపీలు, వీఐపీలు సహకరించాలని బోర్డు సభ్యుల తరఫున శ్రీనివాసరావు కోరారు.